సాక్షి అనకాపల్లి

బుధవారం । 20 । మార్చి । 2024



అష్టదళ పద్మారాధన

విశాఖ: కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు.

అనకాపల్లి: రాగల ఐదురోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉష్ణోగ్రతలు గరిష్టంగా 33.3, కనిష్టంగా 31.2 డిగ్రీలు, తేమ 77 నుంచి 88 శాతం మధ్య, గాలి గంటలకు 6 కి.మీ. వేగంతో వీస్తుందన్నారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (బుధ)	సహర్ (గురు)
అనకాపల్లి	6.11	4.48
నర్సీపట్నం	6.14	4.45

న్యూస్‌రీల్

ప్రశాంతంగా రెండో రోజు టెన్త్ పరీక్షలు



అనకాపల్లి గవరపాలెం చిన్నహైస్కూల్లో హెచ్‌ఎం ఆదినారాయణతో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి, తుమ్మపాల: టెన్త్ పరీక్షల్లో భాగంగా రెండో రోజైన మంగళవారం హిందీ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ చెప్పారు. జిల్లాలో మొత్తం 21,456 మందికిగాను 20,953 మంది విద్యార్థులు హాజరయ్యారని, 503 మంది గైర్హాజరయ్యారన్నారు. విద్యాశాఖ అధికారులు ఐదు బృందాలుగా ఏర్పడి 29 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారన్నారు. ఎస్పీ కె.వి.మురళీకృష్ణ అనకాపల్లి గవరపాలెం జీవీఎంసీ చిన్నహైస్కూల్‌ను సందర్శించి, బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. సార్వత్రిక విద్యా పీఠం ఆధ్వర్యంలో జరుగుతున్న ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలకు మంగళవారం ఇంటర్‌లో 636 మందికి గాను 564మంది విద్యార్థులు, పదో తరగతిలో 249 మందికి 224 మంది విద్యార్థులు హాజరైనట్లు డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు.

రేపటి నుంచి నూకాంబిక దర్శనాలు నిలుపుదల

- 24 నుంచి బాలాలయ దర్శనాలు పునరుద్ధరణ

అనకాపల్లి: స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర ఏర్పాట్లలో భాగంగా బాలాలయంలో అమ్మవారికి రంగులు వేయనున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకూ అమ్మవారి దర్శనాలను నిలుపుదల చేయనున్నట్లు ఆలయ ఈవో బండారు ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు అమ్మవారి ఉత్సవమూర్తి దర్శనం కల్పిస్తామన్నారు. ఈ నెల 24 నుంచి బాలాలయం అమ్మవారి దర్శన భాగ్యం కల్పిస్తూ, అదే రోజు సాయంత్రం 6 గంటలకు కొత్త అమావాస్య జాతర సందర్భంగా ఘటాల చాటింపు ఉంటుందన్నారు.

మాజీ సైనికుల గుర్తింపు కార్డులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు

ఎంవీపీకాలనీ: మాజీ సైనికుల గుర్తింపు కార్డుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సైనిక సంక్షేమాధికారి జి.సత్యానందం కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ గుర్తింపు కార్డుల మంజూరు కోసం డైరెక్టర్, సైనిక సంక్షేమశాఖ విజయవాడ ప్రత్యేక వెబ్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వెల్లడించారు. www.apsainik.com/auth/login లో రిజిస్టార్ చేసుకోవాలని, సంబంధిత అర్హత పత్రాలను అప్‌లోడ్ చేయాలన్నారు. అనంతరం ఆ దరఖాస్తుకు పాస్ పోర్ట్ సైజు ఫోటోలు, బ్యాంకు బుక్, ఆధార్‌కార్డు ప్రతులను జతచేసి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. అనంతరం గుర్తింపు కార్డు జారీ చేస్తామన్నారు.

పక్కా ప్రణాళిక.. పటిష్ట పర్యవేక్షణ

- జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో 8 విభాగాలతో కమాండ్ కంట్రోల్ సెంటర్
- ఎన్నికల నిర్వహణపై 24 గంటల పాటు నిఘా
- ఒక్కో విభాగానికి ఒక్కో నోడల్ అధికారి నియామకం
- ఎన్నికల నోటిఫికేషన్ నుంచి కౌంటింగ్ వరకు విధులు
- ఎప్పటికప్పుడు ఫ్లయింగ్ స్క్వాడ్ విధులపై జీపీఎస్ పర్యవేక్షణ



మీడియా మానిటరింగ్ సెంటర్



కమాండ్ కంట్రోల్ రూం

సాక్షి, అనకాపల్లి: ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి జిల్లాలో ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం పక్కాగా ఏర్పాట్లు చేస్తోంది. దీనికి సంబంధించి సమగ్ర కసరత్తు కూడా చేపడుతోంది. ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు నిఘా పెంచింది. జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టి నేతృత్వంలో 8 విభాగాలతో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. వీటిలో మీడియా మానిటరింగ్ కంట్రోల్ రూం, ఎంసీసీ సెల్, కంప్లయింట్ మానిటరింగ్ సెల్, ఎక్స్‌పెండిచర్ మానిటరింగ్ సెల్, కమ్యూనికేషన్ కంట్రోల్ రూం, సోషల్ మీడియా సెల్, కాల్ సెంటర్, వెబ్ కాస్టింగ్ డెస్క్ ఏర్పాటు చేసి 24 గంటలూ ఎన్నికల విధి విధానాలపై పర్యవేక్షిస్తున్నారు. ప్రచారాల అనుమతులకు సింగిల్ విండో సిస్టమ్ పటిష్టంగా ఏర్పాటు చేస్తున్నారు. కమాండ్ కంట్రోల్ రూం నోడల్ అధికారిగా జిల్లా మత్స్య శాఖ అధికారి ప్రసాద్‌ను నియమించారు. అంతేకాకుండా వీటిలో ఒక్కో విభాగానికి ఒక్కో నోడల్ అధికారినీ ఏర్పాటు చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ నుంచి కౌంటింగ్ వరకు 24 గంటల పాటూ వీరి విధులను మానిటరింగ్ చేస్తూ పర్యవేక్షిస్తారు. అంతేకాకుండా ఫ్లయింగ్ స్క్వాడ్ విధులపై జీపీఎస్ పర్యవేక్షణ ఉంటుంది. కమాండ్ కంట్రోల్ విభాగాన్ని 37 మందితో ఏర్పాటు చేశారు. మూడు షిఫ్టులుగా 24 గంటలూ ఈ విభాగం పనిచేస్తుంది.

24 గంటల కాల్ సెంటర్..

నోడల్ అధికారి: మత్స్య శాఖ జేడీ ప్రసాదరావు

టైమింగ్స్: ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 వరకూ, మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 వరకూ, రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకూ ఐదుగురు సిబ్బంది చొప్పున 24 గంటలూ అందుబాటులో ఉంటారు. అభ్యర్థులు, పార్టీలు నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తిస్తే.. 1950 నంబర్‌కు ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చు. ఎన్నికల కోడ్ ముగిసే వరకూ ఈ కంట్రోల్ రూమ్ ఉంటుంది. ఫిర్యాదులకు ఫోన్ చేసినప్పుడు లైన్స్ బిజీ కాకుండా ఐదు హంటింగ్ లైన్స్ ఏర్పాటు చేశారు.

ఎక్స్‌పెండిచర్ మానిటరింగ్ కంట్రోల్ రూమ్

నోడల్ అధికారి: లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ

ఇందులో యూఎల్‌సీ సెక్షన్ స్టాఫ్ మెంబర్స్‌తోపాటు మరో ముగ్గురు సిబ్బంది ఉంటారు. పార్టీలు, అభ్యర్థులు చేస్తున్న ఖర్చుల వివరాల్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు. తాము చేసిన ఖర్చుల నివేదికల్ని ఈ కార్యాలయానికి అందజేయాలి. ఏ బ్యాంక్‌లో ఎంత డ్రా చేస్తున్నారో తెలుసుకుంటారు. మేనేజర్‌తోపాటు మరో ముగ్గురు బ్యాంక్ సిబ్బంది పనిచేస్తున్నారు

సోషల్ మీడియా మానిటరింగ్ కంట్రోల్ రూమ్..

నోడల్ అధికారి: మైక్రో ఇరిగేషన్‌అధికారి వెంకటలక్ష్మి

మీడియాలో, సోషల్ మీడియాలో వచ్చే ఎన్నికల వార్తలతోపాటు వ్యతిరేక వార్తల్ని ట్రాక్ చేసి నివేదికలు తయారు చేస్తారు. ఏవైనా తప్పుడు వార్తలు ప్రచురిస్తే.. వాటికి సంబంధించిన వాస్తవాలతో కూడిన ప్రెస్‌నోట్స్ విడుదల చేస్తారు. రాజకీయ పార్టీల ప్రకటనలకు సంబంధించిన వివరాల్ని ఎన్నికల సంఘానికి పంపిస్తారు. మొత్తం ఆరుగురు సిబ్బంది పనిచేస్తున్నారు.



వెబ్ కాస్టింగ్ డెస్క్



కాల్ సెంటర్‌ను పర్యవేక్షిస్తున్న కమాండ్ కంట్రోల్ రూం నోడల్ అధికారి ప్రసాద్

కంప్లయింట్ మానిటరింగ్ కంట్రోల్ రూమ్..

నోడల్ అధికారి: మత్స్య శాఖ జేడీ ప్రసాదరావు

అభ్యర్థులు, పార్టీలు నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తిస్తే.. నేరుగా ఈ కేంద్రానికి వచ్చి ఫిర్యాదు చేయవచ్చు. 24 గంటలూ కాల్ సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదులతో పాటు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల ద్వారా వచ్చిన ఫిర్యాదుల్నీ వీరే పర్యవేక్షించి, వాటిని పరిష్కరించి.. సమగ్ర నివేదికని సీఈవో, ఈసీఐకి పంపిస్తారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 వరకూ 8 మంది సిబ్బంది, మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 వరకూ 8 మంది, రాత్రి 10 నుంచి ఉదయం 6 వరకూ 8 మంది సిబ్బందితో 24 గంటలు అందుబాటులో ఉంటుంది. మొత్తం ఆరుగురు పనిచేస్తున్నారు

సీ-విజిల్ కంట్రోల్ రూమ్

నోడల్ అధికారి: మత్స్య శాఖ జేడీ ప్రసాదరావు

ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా(ఈసీఐ) రూపొందించిన సీ-విజిల్(సిటిజన్ విజిలెన్స్) యాప్ ద్వారా పౌరులు ఎన్నికల నిర్వహణపై ఫిర్యాదు చేయవచ్చు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, పార్టీల ఖర్చులకు సంబంధించిన ఫిర్యాదుల్ని ఈ యాప్ ద్వారా ఫోటోలు, వీడియోల రూపంలో అప్‌లోడ్ చేసి ఫిర్యాదు చేస్తారు. ఇందులో ఫిర్యాదు చేసిన 100 నిమిషాల్లో ఈ సీ-విజిల్ కంట్రోల్ రూమ్ సిబ్బంది విచారణ చేపట్టి నివేదికని ఎన్నికల అధికారులకు అందిస్తారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 వరకూ, మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 వరకూ, రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకూ ఏడుగురు సిబ్బంది చొప్పున ఉంటారు.

నేషనల్ గ్రీవెన్స్ పోర్టల్

నోడల్ అధికారి: మత్స్య శాఖ జేడీ ప్రసాదరావు

నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్ ద్వారా ఎన్నికల అధికారులకు ఫిర్యాదులు చేయొచ్చు. ఒకే ఇంటర్ ఫేస్‌లో ఆన్‌లైన్ ద్వారా పరిష్కారమవుతుంది. ఎన్‌జీఎస్పీ వెబ్‌సైట్‌లో 'రిజిస్టర్ ఫిర్యాదు' బటన్‌పై క్లిక్ చేసి ఫిర్యాదుదారు వివరాలు నమోదు చేయాలి. వారి ఆధారాలు కూడా అందులో అప్‌లోడ్ చేయవచ్చు. ఇటువంటి ఫిర్యాదులు కేంద్ర, రాష్ట్ర ఎన్నికల అధికారులకు వెళ్లడంతోపాటు తక్షణ పరిష్కారం అవుతుంది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ, మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 9 గంటల వరకూ నలుగురు సిబ్బంది చొప్పున అందుబాటులో ఉంటారు. ఈ విభాగంలో ఆరుగురు పనిచేస్తారు.

మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ)..

నోడల్ అధికారి: మత్స్య శాఖ జేడీ ప్రసాదరావు

పత్రికలు, టీవీలు, సోషల్ మీడియాల్లో వచ్చిన వార్తలు పెయిడ్ ఆర్టికల్సా, కావా అనేది పరిశీలిస్తారు. పెయిడ్ ఆర్టికల్స్‌గా పరిగణిస్తే.. వాటిని అభ్యర్థుల ఖర్చుల్లో జమ చేస్తారు. డీపీఆర్వో ఇద్దరు సిబ్బంది పనిచేస్తున్నారు.

వెబ్ కాస్టింగ్ కంట్రోల్ రూమ్

నోడల్ అధికారి: మత్స్య శాఖ జేడీ ప్రసాదరావు

24 గంటల పాటు ప్రతి 8 గంటలకు ఇద్దరు చొప్పున అందుబాటులో ఉంటారు. జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి 24 ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను జీపీఎస్ ద్వారా మానిటరింగ్ చేసి ఆ వాహనాలు ఎక్కడ ఉన్నాయో ఎప్పటికప్పుడు సమాచారం నోడల్ అధికారికి చేరవేస్తారు. ఏ లోకేషన్ నుంచి ప్రారంభమై ఎక్కడకు వెళుతుందో నమోదు చేసుకుంటారు.

బిందువే సింధువై..

- కదలలేని నిరుపేదను ఆదుకున్న 'సాయానికి 10 రూపాయలు' సేవా సంస్థ
- విరాళాలు సేకరించి ఆపరేషన్ కోసం ఏకంగా రూ.10.59 లక్షలు అందజేత



శ్రీహరికి రూ.10.59 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

తుమ్మపాల: ఎంత సుదీర్ఘ ప్రయాణమైనా ఒక్క అడుగుతోనే మొదలవుతుంది. బిందువు బిందువు ఏకమై మహా సముద్రమవుతుంది. ఏఎంఏఎల్ కళాశాల పూర్వ విద్యార్థులు స్థాపించిన 'సాయానికి 10 రూపాయలు సేవా సంస్థ' ఎందరినో ఆపద్బాంధవిలా ఆదుకుంటోంది. నర్సీపట్నం మూడో వార్డుకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు మల్రా శ్రీహరి ప్రమాదంలో వెన్నుపూస విరిగిపోయి మంచానికి పరిమితమయ్యాడు. ఆపరేషన్‌కు రూ.6 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. పేదరికం అతడి ఆపరేషన్‌కు అడ్డు పడింది. అతడి గాథను విన్న 'సాయానికి 10 రూపాయలు సేవా సంస్థ' ముందుకొచ్చి అతడి వేదనను వీడియో రూపంలో చిత్రీకరించి సోషల్ మీడియా, వివిధ రూపాలలో ఏడు రోజులపాటు విరాళాలను సేకరించింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఏకంగా రూ.10 లక్షల 59 వేల 904లు రావడంతో సంస్థ అధ్యక్షుడు లాలం ఏసుబాబుతో పాటు హోమియోపతి వైద్య నిపుణుడు డాక్టర్ శశిధర్, ఏఎంఏఎల్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎం.హరిబాబు, నర్సీపట్నం ఎంఈఓ జి.వి..ఎస్.నాగేంద్ర, బొడ్డపల్లి హైస్కూల్ ఉపాధ్యాయులు వి.వి.ప్రభాకర్ మంగళవారం బాధితుడు శ్రీహరి ఇంటికి వెళ్లి అతడికి నగదు సహాయాన్ని అందించారు.

వైభవంగా మోదకొండమ్మ వీధి పండగ 8లో

ఆనందమానందమాయె..

పండుటాకులకు బాసటగా నిలవాలని.. ఊరట కలిగించాలని సంకల్పించుకోవడం ఒక ఎత్తయితే.. ఆశయాన్ని తూచా తప్పక పాటించడం మరో ఎత్తు. మంచి చేయాలన్న ఆలోచన.. కార్యరూపంలో పెట్టాలన్న పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమే అన్న దానికి సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమమే ఒక ఉదాహరణ. ఒకటో తేదీన ఠంచనుగా లబ్ధిదారుల ఇంటికే వెళ్లి వలంటీర్లు పెన్షన్లు పంపిణీ చేయడం కలలో కూడా ఊహించని పరిణామం. ప్రస్తుత ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తున్న ఈ కార్యక్రమం.. గతంలో జన్మభూమి కమిటీల పెత్తనం కింద నలిగిపోయిన బడుగు జీవులకు ఎంత ఊరట కలిగించిందో ఒకసారి పరిశీలిద్దాం..

8లో

ఎన్నికల బృందాలు సమన్వయంతో పనిచేయాలి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

తుమ్మపాల: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా వివిధ విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంసీసీ, ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వైలెన్స్, వీడియో వీవింగ్, స్టాటిక్ సర్వైలెన్స్, మీడియా మోనటరింగ్ బృందాలు సంబంధించిన విషయాలను క్షుణ్ణంగా గమనించడం, పరిశీలన, తనిఖీ చేయాలని సూచించారు. ప్రతీ టీమ్‌కు మిగిలిన టీమ్‌లతో సంబంధం ఉంటుందన్నారు. దానిని అనసరించి నియమావళి ప్రకారం తగిన చర్యలు చేపట్టాలన్నారు. నియమావళి ఉల్లంఘనలో భాగంగా పార్టీ, అభ్యర్థుల ఖర్చు, ర్యాలీలు, సమావేశాలను, ప్రకటనలు, బ్యానర్ల అనుమతులు, వాటి ఖర్చును లెక్కవేయడం, నాయకుల ఉపన్యాసాలు మొదలైనవన్నీ ఫ్లయింగ్ స్క్వాడ్ వీడియోల ద్వారా వీవింగ్ టీమ్ గుర్తిస్తుందన్నారు. ఎంసీసీ టీమ్ మోడల్ కోడ్‌ను గమనిస్తుందన్నారు. వీటన్నింటి నుంచి వచ్చిన అంశాలు, అభ్యర్థులు సమర్పించిన డాక్యుమెంట్లను బేరీజు వేసి చూస్తుందన్నారు. అభ్యర్థులు సమర్పించిన ఖర్చును వ్యయ పరిశీలకులు వివరించాల్సి ఉంటుందన్నారు. వివిధ పత్రికలలో వచ్చిన ప్రకటనలు, పెయిడ్ న్యూస్‌ను గుర్తించాలన్నారు. పత్రికలు, టీవీలు, సోషల్ మీడియాలో వచ్చిన సమాచారంపై నిజానిజాలను వివరించాలన్నారు. ప్రసంగాలు ఏవిధంగా ఉన్నాయి, ప్రాంతాన్ని, సామాజికవర్గం, మతాలకు సంబంధించి ఎవరైనా మాట్లాడారా, దూషణలు ఉన్నాయా అన్నది తేల్చాలన్నారు. సమావేశంలో కోఆపరేటివ్ ఆడిట్ అధికారి గోవిందరాజులు, జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి మంజులవాణి, డీఎల్‌డీవో నాగలక్ష్మి, సీపీవో రామారావు, పౌర సరఫరాల శాఖ డీఎం జయంతి, లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

వేయి కనులు చాలవులే..



నక్కపల్లి: కల్యాణశోభను సంతరించుకున్న వేంకటేశ్వరస్వామి

- ఉపమాకలో నేడు కన్నులపండువగా కల్యాణం
- అంకురార్పణతో శ్రీకారం చుట్టిన అర్చకస్వాములు
- స్వర్ణాభరణాలతో దర్శనమిస్తున్న స్వామివారు



నక్కపల్లి: వెంకన్న కల్యాణానికి అంకురార్పణ



నక్కపల్లి: స్వామివారి పెళ్లి కావిడిని ఊరేగిస్తున్న అర్చకులు



ఉపమాకలో విద్యుద్దీపాలతో కాంతులీనుతున్న ఆలయ ప్రాంగణం

నక్కపల్లి: కోనేటిరాయుడి కల్యాణానికి వేళయింది. ఉపమాక గరుడాద్రి పర్వతంపై ఏకశిలపై వెలసిన లోకేశుని దివ్యకల్యాణ మహోత్సవాన్ని బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం వారు ఏర్పాట్లు పూర్తి చేశారు. వార్షిక తిరుకల్యాణోత్సవాలకు మంగళవారం సాయంత్రం అంకురార్పణ జరిగింది. స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పరిషత్, కంకణ ధారణ, అంతరాలయ దేవతా పూజ, మత్స్యంగ్రహణం నిర్వహించారు. అంకురార్పణ పూజాకార్యక్రమాల్లో భాగంగా గజవాహనంపై తిరువీధి సేవ నిర్వహించారు. స్వామివారి కల్యాణమండపంలో ఉభయ దేవేరులను ఉంచి సుదర్శన పెరుమాళ్లను పల్లకిలో ఉంచి పుట్టమన్ను తెచ్చేందుకు తీసుకెళ్లారు. దీన్నే అంకురార్పణ అంటారు. స్వామివారి పెళ్లి కావడిని ఉపమాక మాడ వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమాలతో స్వామివారి కల్యాణోత్సవాలు లాంఛనంగా ప్రారంభమయ్యాయని, అందరూ ఆహ్వానితులేనంటూ తెలియజేసినట్లేనని ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ తెలిపారు.

స్వర్ణాభరణాలతో దివ్యమంగళ స్వరూపం

స్వామివారి కల్యాణం బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా జరగనుంది. సాయంత్రం కన్యావాద సంవాదం, అనంతరం రథోత్సవం జరుగుతుంది. విశాఖ సబ్ ట్రెజరీలో ఉన్న నగలను తీసుకువచ్చి మంగళవారం రాత్రి స్వామివారికి అలంకరించారు. బుధ, గురువారాల్లో రెండురోజుల పాటు స్వర్ణాలంకరణ భూషితుడైన స్వామివారి దివ్యమంగళ స్వరూపం భక్తులను పరవశులను చేయనుంది. ఆలయ ప్రాంగణంతోపాటు గోపురాలు, బేడామండపం, ఆస్థాన మండపం, కల్యాణమండపాలకు రంగురంగుల విద్యుద్దీపాలను అలంకరించారు. గాలిగోపురం ఎదురుగా అఖండం ఉన్న చోట హైమాక్స్ దీపాలు ఏర్పాటు చేశారు. దీంతో రాత్రి పూట ఆలయం విద్యుద్దీపాలంకరణతో మెరిసిపోతోంది.

తిరుమల వేదపండితుల ఆధ్వర్యంలో కల్యాణం

కల్యాణతంతును నిర్వహించేందుకు తిరుచానూరు పద్మావతి ఆలయానికి చెందిన ప్రముఖ వేదపండితులు, ఆగమశాస్త్ర సలహాదారులను రప్పిస్తున్నారు. పద్మావతి అమ్మవారి ఆలయ ప్రధానార్చకులు కాండూరి శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం నేత్రపర్వంగా జరగనుంది.

వడ్డాది వెంకన్న కల్యాణం చూతము రారండీ..

బుచ్చెయ్యపేట: ప్రసిద్ధి చెందిన వడ్డాది వేంకటేశ్వరస్వామి 151వ కల్యాణ మహోత్సవాలు అంకురార్పణతో ప్రారంభమయ్యాయి. మంగళవారం రాత్రి దశమి రోజున శ్రీదేవి, భూదేవి, వేంకటేశ్వర స్వామిల ఐదు రోజుల కల్యాణ మహోత్సవాలకు శ్రీకారం చుట్టారు. మేళతాళాలు, వేదపండితుల సమక్షంలో గిరిజాంబ కొండ దిగువన స్వామి వారి కల్యాణానికి ఆలయ వంశపారంపర్య ధర్మకర్త దొండా కన్నబాబు, దేవస్థానం ఈవో శర్మ, ప్రధాన అర్చకులు సాయి శ్రీకాంత్ ఇతర అర్చకులు అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాలు చేపట్టారు. కొండ దిగువన పుట్ట వద్ద శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేసి పుట్ట మన్ను తెచ్చి నవధాన్యాలతో ధ్వజారోహణ చేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. కల్యాణ వేడుకలు జరిగే ఐదు రోజుల్లో నవధాన్యాల్లో ఏ రకం విత్తనాలు అయితే బాగా మొలకెత్తుతాయో ఆ పంటలకు ఈ ఏడాది రాశి బాగుంటుందని, పంటలు బాగా పండి దిగుబడులు బాగుంటాయని రైతులు నమ్ముతారు.



వడ్డాది వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న ఎస్పీ మురళీకృష్ణ

బుధవారం రాత్రి ఏకాదశి రోజున గిరిజాంబ కొండపై శ్రీదేవి,భూదేవితో వేంకటేశ్వరస్వామి మండపంలో కల్యాణాన్ని వేడుకగా నిర్వహించడానికి దేవస్థానం అధికార్లు తగిన ఏర్పాట్లు చేశారు.

బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ

వడ్డాది వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ కె.వి.మురళీకృష్ణ మంగళవారం రాత్రి పరిశీలించారు. ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీసుకున్న బందోబస్తు ఏర్పాట్లపై ఆయన డీఎస్పీ అప్పలరాజు, సీఐ ఎల్.అప్పలనాయుడు, ఎస్‌ఐ డి.ఈశ్వరరావులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇద్దరు సీఐలు, ఏడుగురు ఎస్‌ఐలతోపాటు వంద మందితో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీకి డీఎస్పీ వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మురళీకృష్ణ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

రాత్రి 12 గంటలలోపే కల్యాణ ఘట్టం

నక్కపల్లి: ఉపమాకలో ఈ ఏడాది స్వామివారి కల్యాణం వీలైనంత త్వరగా చేయాలని టీటీడీ వారు నిర్ణయించినట్టు ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ తెలిపారు. తెల్లవారుజామున కాకుండా 12 గంటలలోపే కల్యాణ ఘట్టం ముగిసే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. అంకురార్పణతో ఉత్సవాలు లాంఛనంగా ప్రారంభమయ్యాయని, కన్యావాద సంవాదం రథోత్సవం కూడా సాయంత్రమే ప్రారంభిస్తామని చెప్పారు.

పింఛన్ వస్తుందన్న ధైర్యంతో బత్కుతున్నాం..



నా పేరు నీలం కుమారి, నాతవరం గ్రామం, వైఎస్సార్ కాలనీ. గ్రామంలో కూలీ పని చేసుకుంటూ జీవనం సాగించోళ్లం. నా పెనిమిటి భీమ్రాజు 2005లో ఒంట్లో బాగోక చచ్చిపోయిండు. రాజశేఖర్‌రెడ్డి పాలనలో నెలకు రూ.200 పెంఛన్ ఇచ్చేటోరు. నా భర్త ఉన్నప్పుడు కొంత మొత్తంలో దాచుకున్న డబ్బులతో నా కుమార్డుని చదివించోళ్లం. నా భర్త పోయేసరికి నా అన్న వారంతా దూరమయ్యేరు. అనారోగ్యంతో కుమారుడి ఏ పని చేయక్కుండా ఇంటి పట్టునే ఉంటుండు. గత పెభుత్వంలో పింఛన్ డబ్బులు కోసం పంచాయతీ చుట్టూ తిరిగేవోళ్లం. అప్పట్లో రెండు మూడు పంచాయతీలకు ఒక్కడే కార్యదర్శి అవడం వల్ల రోజూ ఎద్రుసూసేదాన్ని. ఒక్కోసారి కొందరికిచ్చి మధ్యలో వెళ్లిపోయేవోడు. జగన్ బాబు వచ్చాక పెంఛన్ డబ్బులు పెంచేడు. తెల్లారేసరికే ఇంటికొచ్చి వలంటీరు ఇస్తు న్నరు. రూ.3 వేల పెంఛన్‌తోపాటు వైఎస్సార్ చేయూతలో రూ.18,750 వత్తన్నాయి. ఇంటి వద్దే చిన్న షాపు పెట్టుకోని జీవనం సాగిస్తు న్నం.ప్రతి నెలా ఒకటినే పెంఛన్ వస్తుం దన్న ధైర్యం ఉంది.

మూడు వేలు ఇత్తానన్నందుకు ఇస్తుండు...



నా పేరు మదార్‌బీబీ. మాది చోడవరం మండలం అంభేరుపురం గ్రామం. నా వొయసు 75. నాకు కొడుకు, కూతురు వాళ్లమా నాన వాలు బతుకుతుంద్రు. ముందు మా వోడికి(భర్త) రాజశేఖర్‌రెడ్డి టైం నుంచి రూ.200 పెంఛను వచ్చేది. ఆయన సనిపోయాక నాకు వస్తుంది. సంద్రబాబు టైంలో రూ.500 యిచ్చేవోళ్లు. ఆఖరున ఎయ్య సేసారు. జగన్ వచ్చాక రూ.3 వేలు సేత్తానన్నాడు. అన్నందుకు సేసాడు. జగనుబాబు సేత్తున్నందంతా బాగుంది. తెల్లారే సరికి ఇంటికి మా వాలంట్రీ పిన్సన్ తెస్తరు. ఆర్థిక కష్టాలు తీరాయి. సెంద్రబాబు టైంలో పింఛను కావాలంటే ఆఫీసు చుట్టూ తిరగాల్సొచ్చేది. అలా ఎల్తే ఇచ్చేవారు. ఇప్పుడదిలేదు. మరి వచ్చే నెల నుంచి ఇంటికి ఇవ్వరట, మా వోలంటీరు సెప్పాడు. మరీ రెండు మూడు నెల్లు ఎలాగో.. మల్లీ జగనే రావాలని ఉంది. పెజలేం సేత్తారో.

నాలాంటోళ్లకు అండగా జగన్



నా పేరు ఉమ్మిడి అమ్మోరమ్మ. నేను మత్స్యకార కుటుంబానికి చెందిన మహిళను. మంగమారిపేటలో నివాసం ఉంటున్నాను. నా భర్త ఉమ్మిడి ఎల్లయ్య తొమ్మిదేళ్ల కిందట చనిపోయాడు. నాకు ఎల్లాజీ, ఆదిలక్ష్మి, అరుణ ముగ్గురు ఆడ పిల్లలు. కూలి పనులు చేసుకుని.. ముగ్గురు ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేశాను. ప్రస్తుతం నేను నా తమ్ముడు ఇంట్లో ఉంటున్నాను. ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ రూ.3 వేలు నా నెల ఖర్చుకు సరిపోతోంది. చిన్న చిన్న పనులు చేసుకుంటూ నా శేష జీవితాన్ని సంతోషంగా గడుపుతున్నాను. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పింఛన్‌కోసం మాకు దూరంగా ఉన్న కె. నగరపాలెం పంచాయతీ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. కనీసం వారం రోజులు ఎండలో తిరిగేవాళ్లం. జగన్‌బాబు వచ్చిన తర్వాత వలంటీర్లు ఇంటికే వచ్చి పింఛన్ ఇస్తున్నారు. మూడు పూటలా కడుపు నిండా తింటున్నా. జగన్‌బాబు చల్లగా ఉండాలి.

పింఛన్‌తో సాఫీగా జీవనం



నా పేరు దొర చిన్నమ్మి. నా భర్త ఐదేళ్ల కిందట అనారోగ్యంతో మృతి చెందాడు. నాకు పిల్లలు లేరు. నేను లోచలిపుట్టులో జీవనం సాగిస్తున్నాను. కూలికి వెళ్తే కానీ పూట గడవని పరిస్థితి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ కోసం పంచాయతీ కార్యాలయం వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చేది. ఒకటో తేదీన పింఛన్ ఇచ్చిన సందర్భాలు లేవు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక క్రమేపి పింఛన్ నగదును రూ.3వేలకు పెంచారు. ప్రతి నెల ఒకటో తేదీన ఇంటి వద్దే గ్రామ వలంటీర్ వచ్చి పింఛన్ అందజేస్తున్నారు. రేషన్ సరకులు సైతం ఇంటి వద్దకే అందుతున్నాయి. ఏ ఆసరా ఆర్థిక తోడ్పాటు లేని నాలాంటి వారికి జగనన్న ప్రభుత్వం అందజేస్తున్న పింఛన్ సొమ్ము ఎంతో ఉపయోగపడుతోంది. ఈ సొమ్ముతో సాఫీగా జీవనం సాగుతోంది.

నాడు కత్తెర.. నేడు జాతరలా ఆనందమానందమాయె

- చంద్రబాబు హయాంలో పింఛనుదారుల బాధలు వర్ణనాతీతం
- రాబందుల్లా పీక్కుతిన్న జన్మభూమి కమిటీలు
- కుంటిసాకులు చెబుతూ వృద్ధుల పింఛన్లకు కత్తెర
- వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మారిన చిత్రం
- ప్రస్తుతం రూ.3 వేలు వరకు పింఛన్ అందజేత
- పండుటాకుల్లో విరబూసిన చిరునవ్వులు

జన్మభూమి కమిటీ.. చంద్రబాబు పాలనలో ఈ పేరు వింటేనే ప్రతీ పెన్షన్ లబ్ధిదారుడు వణికి పోయే పరిస్థితి ఉండేది. పండుటాకులను రాబందుల్లా పీక్కుతింటూ పింఛన్‌దారులకు చుక్కలు చూపించేవి. అంతేనా.. నెల నెలా పెన్షన్ డబ్బులు తీసుకోవాలంటే నడవలేని, నిలబడలేని స్థితిలో కూడా చాంతాడంత క్యూల్లో.. ఎర్రటి ఎండలో గంటల తరబడి నిరీక్షించిన రోజులు మరిచిపోగలమా? పైగా.. చంద్రబాబు పాలనలో అన్నీ అర్హతలున్న వాళ్లు పెన్షన్ కావాలంటే ఏడాదికో, లేదంటే రెండేళ్ల కోసారో మొక్కుబడిగా ప్రభుత్వం నిర్వహించే జన్మభూమి కార్యక్రమంలోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉండేది. పింఛన్ తీసుకుంటున్న వారు ఎవరైనా మరణిస్తేనో లేదా ఇతర కారణాలతో తగ్గితేనే కొత్త పెన్షన్లు మంజూరయ్యేవి. అలాంటి పరిస్థితుల్లో.. పింఛన్లు అందక విలవిల్లాడే దుస్థితిలో ఉన్న అవ్వాతాతలకు అండగా నిలుస్తూ.. వారి మోముల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చిరునవ్వులు నింపింది. అవ్వాతాతలు, దివ్యాంగులు సహా ఇతర సామాజిక భద్రతా పెన్షన్ లబ్ధిదారులందరికీ రామరాజ్యమంటే ఏంటో.. సంక్షేమ శకం తీపిగుర్తులు ఎలా ఉంటాయో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చూపించారు. వలంటీర్ల వ్యవస్థతో ఇంటికే పింఛను అందిస్తూ.. వారికి కొండంత భరోసానిచ్చారు.

– సాక్షి, విశాఖపట్నం/నాతవరం/చోడవరం రూరల్/ఎటపాక/కొమ్మాది

ముఖ్యమంత్రిగా చంద్రబాబు వెలగబెట్టిన తొమ్మిదేళ్లలో ఏనాడు అవ్వా తాతలను పట్టించుకున్న పాపానపోలేదు. ఆ రోజుల్లో పింఛన్ రూ.75 ఇచ్చే వారు. ఏ గ్రామంలోనైనా ఎవరైనా చనిపోతే తప్ప కొత్తగా ఒక్క పింఛన్ కూడా మంజూరు చేసే వారు కాదు. మహానేత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజాప్రస్థానం పాదయాత్రలో అవ్వాతాతలు పడుతున్న బాధలను చూసి చలించిపోయారు. 2004లో అధికారంలోకి వచ్చీ రాగానే పింఛన్‌ను ఒకేసారి రూ.200కు పెంచారు. అంతే కాదు సంతృప్తికర పద్ధతిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఫించన్లు మంజూరు చేశారు. ఆయన హయాంలో మంజూరైనన్ని పెన్షన్లు.. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ మంజూరవలేదన్నది చరిత్ర చెబుతోంది. 2014లో టీడీపీ అధికారంలోకి రాగానే జన్మభూమి కమిటీల పేరిట... ఉన్న పింఛన్లకు చంద్రబాబు కోత పెట్టారు. పెద్ద ఎత్తున వడపోతలు మీద వడపోతలు చేస్తూ దాదాపు 30 వేలకు పైగా పింఛన్లను తీసేశారు చంద్రబాబు.



ఆ రోజుల్లో పచ్చ చొక్కాలదే హవా

టీడీపీ అధికారంలోకి రాక ముందు జిల్లాలో 3.28 లక్షల పింఛన్లుండేవి. జన్మభూమి కమిటీల పరిశీలన పేరిట 15 వేలకు పైగా పింఛన్లను తొలగించి ఆ తర్వాత రోల్‌బ్యాక్ అంటూ వాటిని పునరుద్ధరిస్తున్నట్టు ప్రకటించి తమకు నచ్చిన వారికి మంజూరు చేశారు. ఆ తర్వాత కొత్త పింఛన్ల పేరిట 2014 నుంచి 2019 వరకు 90 వేల పింఛన్లు మంజూరు చేశారు. వీటిలో 90 శాతం జన్మభూమి కమిటీ సిఫార్సులతో పూర్తిగా టీడీపీ నేతలు, కార్యకర్తలకే కేటాయించారు. ఇళ్లు, పొలాలు, ఆస్తులున్న వారికి సైతం పింఛన్లు అందజేసేవారు. అన్ని అర్హతలున్న వారిని పక్కన పెట్టేశారు. పైగా ప్రతి నెలా ఆధార్ లింక్ కాలేదని, వేలి ముద్రలు పడలేదని, ఐరిస్ క్యాప్చర్ కాలేదనే సాకుతో 10 నుంచి 15 శాతం మంది పింఛన్ దారులకు మొండిచేయి చూపించారు. 2018 డిసెంబర్ వరకు పింఛన్ల కోసం అప్పటి ప్రభుత్వం జిల్లాకు నెలకు రూ.48 కోట్ల వరకు విడుదల చేసింది.

వైఎస్ జగన్ హామీతో హడావిడిగా..

ప్రజా సంకల్పయాత్రలో భాగంగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రకటించిన నవరత్నాల్లో పింఛన్ పెంపు హామీని కాపీ కొట్టిన చంద్రబాబు 2019 జనవరి నుంచి పెన్షన్లు పెంపుదల చేశారు. కొత్త పెన్షన్లు మంజూరు చేసిన ప్రతీసారి ఒక్కో లబ్ధిదారుడి నుంచి రూ.500 నుంచి రూ.1000 వరకు తెలుగు తమ్ముళ్లు మామూళ్లు దండుకున్నారు. ఈ విధంగా దాదాపు జిల్లా వ్యాప్తంగా రూ.15 కోట్లకు పైగా వసూళ్ల దందా సాగించారు.

బాబు కుట్రను ముందే పసిగట్టిన జగన్

'జగనన్న వస్తున్నాడు... నవరత్నాలు తెస్తున్నాడు...'అంటూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే ప్రస్తుతం ఇస్తున్న రూ.1000 పింఛన్ మొత్తాన్ని రూ.2 వేలకు పెంచుతామని గుంటూరు వేదికగా జరిగిన పార్టీ ప్లీనరీలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. ఈ హామీపై ప్రజా సంకల్పయాత్రలో విస్తృత ప్రచారం చేస్తూనే కడప జిల్లా పర్యటనలో ఆయనో మాట చెప్పారు. ఆ దేవుడు ఆశీర్వదించి..మీ అందరి చల్లని దీవెనలతో మనందరి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అవ్వాతాతలకు పింఛన్ రూ.2 వేలు చేస్తానని చెప్పారు. జగన్ చెప్పాడు కదా అని చంద్రబాబు ఎన్నికల ముందు రూ.2వేలు చేసినా ఆశ్చర్య పోనక్కర్లేదు. చేస్తే చేయనీయండి. ఫర్వాలేదు. అవ్వాతాతలకు ఎంత చేసినా తక్కువే. మన ప్రభుత్వం రాగానే ఆ రూ.2వేలను రూ.3వేలకు పెంచుకుంటూ పోతా.. అని హామీ ఇచ్చారు. జననేత ఊహించినట్టుగానే 2019 ఎన్నికలకు 3 నెలలు ఉండగా అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఓ పక్క ఆర్థిక లోటంటూనే పింఛన్ మొత్తాన్ని రూ.2 వేలు పెంచుతూ ప్రకటన చేసి... ఫిబ్రవరి నుంచి అమల్లోకి తీసుకొచ్చారు. ఇందుకోసం చంద్రన్న వరాల పండగ పేరిట ఫిబ్రవరి 2, 3, 4 తేదీల్లో మూడు రోజుల పాటు హంగామా చేశారు. పెంచిన పింఛన్ పంపిణీలో కూడా టీడీపీ నేతలు చేతివాటం ప్రదర్శించడం మానలేదు. ఒక్కో పింఛన్‌దారుడి నుంచి రూ.500 వరకు వసూళ్లకు పాల్పడ్డారు.

సీఎం జగన్ పాలనలో.. సంతృప్త స్థాయిలో..

వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే పింఛనుదారులకు కష్టాలన్నీ దూరమయ్యాయి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థతో లబ్ధిదారులు చిరునవ్వుతో ఇంటి వద్దనే పింఛను తీసుకుంటున్నారు. చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీలు చెప్పిన చోటుకి వెళ్లి పింఛను తీసుకునేవారు. ఎండలో.. లైన్లలో నిలబడితే.. ఒకటో తేదీ నుంచి పంచడం మొదలు పెట్టేవారు. 15వ తేదీ వచ్చినా కొందరికి పింఛను అందేది కాదు. కానీ వైఎస్సార్‌సీపీ హయాంలో.. ఒకటో తేదీనే ఇంటికొచ్చి మరీ వలంటీరు పింఛను అందిస్తున్నారు. దీంతో.. అవ్వాతాతలే కాదు.. ఒంటరి మహిళలు, దివ్యాంగులు, డయాలసిస్ రోగులు.. ఇలా ప్రతి ఒక్కరికీ గుమ్మం వద్దే పింఛన్లు అందుతున్నాయి. 2019 నాటికి ఉమ్మడి విశాఖ జిల్లాలో అన్ని వర్గాల పింఛనుదారులు 4.22 లక్షల మంది ఉన్నారు. 2019 జనవరి వరకు కేవలం రూ.48 కోట్లను మాత్రమే ప్రభుత్వం కేటాయించేది. జనవరి తర్వాత మూడు నెలల పాటు రూ 2 వేలు ఇచ్చిన టీడీపీ ప్రభుత్వం.. ప్రతి నెలా రూ.75.83 కోట్లు చెల్లించేది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత.. కుల, మత, ప్రాంత, రాజకీయాలకతీతంగా.. ఎటువంటి లంచాలు లేకుండా పింఛన్ అందిస్తోంది. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు అనర్హులైన వారికి పింఛన్లు అందించాయి. ఇలాంటి 10 వేల మందికిపైగా గుర్తించి.. వారి పింఛన్లు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రద్దు చేసింది. వారి బదులుగా.. పూర్తి అర్హతలున్న వారికి పింఛన్లు మంజూరు చేసింది. ప్రస్తుతం పింఛన్‌దారులకు రూ.3 వేల చొప్పున అందుతోంది.

టీడీపీ హయాంలో ఉమ్మడి విశాఖలో మొత్తం పింఛన్లు	
అర్బన్ ప్రాంతం	1,16,789
గ్రామీణ,ఏజెన్సీ ప్రాంతం	3,05,546
మొత్తం పింఛన్ల సంఖ్య	4,22,335
ప్రతి నెలా ఇచ్చిన మొత్తం	రూ.75.83 కోట్లు
2019 తర్వాత.. వైఎస్సార్ సీపీ హయాంలో..	
ఉమ్మడి విశాఖలో మొత్తం పింఛన్లు	5,61,336
ప్రతి నెలా అందిస్తున్న మొత్తం	రూ.166.82 కోట్లు
విశాఖ జిల్లాలో మొత్తం పింఛన్లు	1,65,891
ప్రతి నెలా అందిస్తున్న మొత్తం	రూ.50.11 కోట్లు
అనకాపల్లి జిల్లాలో మొత్తం పింఛన్లు	2,67,097
ప్రతి నెలా అందిస్తున్న మొత్తం	రూ.77.78 కోట్లు
అల్లూరి జిల్లాలో మొత్తం పింఛన్లు	1,28,348
ప్రతి నెలా అందిస్తున్న మొత్తం	రూ.38.93 కోట్లు

జనసేన...వేసెయ్ టీడీపీ కండువా

- అయ్యన్న కండువాల రాజకీయంపై జనసేన గరం
- పొత్తు ధర్మాన్ని విస్మరించి తమ నాయకులను టీడీపీలో చేర్చుకోవడంపై అసంతృప్తి

నర్సీపట్నం : ఎన్నికల వేళ టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు కండువాల రాజకీయానికి తెరలేపారు. టీడీపీ, జనసేన పొత్తులో భాగంగా ఇరుపార్టీలు వలసలు ప్రోత్సహించుకోకూడదని ఒప్పందం చేసుకున్నారు. కానీ అయ్యన్నపాత్రుడు మిత్ర ధర్మాన్ని పక్కన పెట్టి జనసేన నాయకులను టీడీపీలో చేర్చుకోవడానికి శ్రీకారం చుట్టారు. నియోజకవర్గంలో అంతంత మాత్రంగా ఉన్న జనసేన క్యాడర్‌కు అయ్యన్నపాత్రుడు వ్యవహారశైలి మింగుడు పడడం లేదు. ఈ ఎన్నికల్లో గట్టెక్కేందుకు అయ్యన్నపాత్రుడు చోటామోటా నాయకులకు కండువాలు వేస్తున్నారు. అయ్యన్నపాత్రుడు ప్రోత్సహిస్తున్న వలసలతో నియోజకవర్గంలో జనసేన కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. నర్సీపట్నం మండలం, చెట్టుపల్లి గ్రామానికి చెందిన గజాల నాగరత్నం స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన మద్దతుతో సర్పంచ్‌గా గెలుపొందారు. అప్పట్లో ఆమెకు మద్దతుగా జనసేన నియోజకవర్గ కన్వీనర్ రాజాన వీర సూర్యచంద్ర, పూడి చక్రవర్తి, అద్దేపల్లి గణేష్ నాగరత్నంను గెలిపించాలని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జనసేన మద్దతుతో గెలిచిన సర్పంచ్ దంపతులు గజాల నాగరత్నం, సూరిబాబుతో పాటు నలుగురు వార్డు మెంబర్లు మంగళవారం అయ్యన్నపాత్రుడు సమక్షంలో టీడీపీలో చేరారు. దీంతో మిత్ర ధర్మానికి అయ్యన్నపాత్రుడు తూట్లు పొడవడంతో పలువురు విస్మయం చెందుతున్నారు. అయ్యన్నపాత్రుడు కండువా రాజకీయంతో నియోజకవర్గంలో జనసేన పార్టీ తుడుచుపెట్టుకుపోతుందని చెబుతున్నారు.

వేధింపుల కేసులో ఇద్దరికి జైలు, జరిమానా

సబ్బవరం : భార్యాభర్తల మధ్య తలెత్తిన వివాదంలో భార్యను వేధింపులకు గురి చేసిన కేసులో నేరం రుజువు కావడంతో అనకాపల్లి 7వ ఎంఎం కోర్టు జడ్జి బీవీవీ విజయలక్ష్మి బాధితురాలి భర్త, మరిదికి జైలుతో పాటు జరిమానా విధించారు. స్థానిక సీఐ పిన్నింటి రమణ మంగళవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బోదివలస గ్రామానికి చెందిన నేబర్తి త్రివేణి తనను భర్త నేబర్తి శ్రీను, మరిది నేబర్తి రమేష్, ఆడపడుచు పద్మ వేధిస్తున్నారని 2020 జూలై 7న స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టి చార్జిషీట్ ఫైల్ చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మృణాళిని వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో నిందితులకు జడ్జి విజయలక్ష్మి నేబర్తి శ్రీనుకు ఏడాది జైలుతో పాటు రూ. 5 వేల జరిమానా, మరిది రమేష్‌కు నెల రోజులు జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించినట్టు సీఐ తెలిపారు.

సారా విక్రేత అరెస్టు

- వెయ్యి లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



సారా తయారు చేస్తుండగా సత్తిబాబును పట్టుకున్న సీఐ సునీల్‌కుమార్, సిబ్బంది

నర్సీపట్నం : మున్సిపాలిటీ పరిధి పెదబొడ్డేపల్లిలో ఎస్ఈబీ సీఐ కె.సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం సారా బట్టీలపై దాడులు నిర్వహించారు. సారా తయారు చేస్తుండగా పిల్లి సత్తిబాబు(37) అనే వ్యక్తిని పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 50 లీటర్ల నాటుసారా, వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. మరో వ్యక్తి పెంకి చిన్న పరారయ్యాడు. సత్తిబాబును తహసీల్దార్ వద్ద హాజరు పరిచి బైండోవర్ చేశామని సీఐ తెలిపారు.

భవనంపై నుంచి జారిపడి కార్మికుడు మృతి



మృతుడు రామకృష్ణ

కోటవురట్ల : భవన నిర్మాణ పనులు చేస్తున్న ఓ కార్మికుడు ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. ఎస్ఐ రమణయ్య తెలిపిన వివరాలివి..లింగాపురం గ్రామానికి చెందిన విసరపు రామకృష్ణ(28) తాపీ మేస్త్రిగా పనిచేస్తున్నాడు. కోటవురట్లలోని అల్లు ముసిలినాయుడు అనే వ్యక్తికి చెందిన మూడంతస్తుల భవనంపై సర్వసిద్ధి దినేష్ కుమార్, మేడిపల్లి నాగరాజు, మేడిపల్లి రాజులతో కలిసి పని చేస్తున్నాడు. రామకృష్ణ ప్రమాదవశాత్తు మూడంతస్తుల నుంచి కిందికి పడిపోవడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తండ్రి రమణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు.

200 మంది వైఎస్సార్‌సీపీలో చేరిక



కొత్తపట్నంలో వైఎస్సార్‌సీపీలో చేరిన వారిని సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే కన్నబాబు

- కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే కన్నబాబు

రాంబిల్లి : జననేత జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తి రాజు(కన్నబాబు)అన్నారు. కొత్తపట్నంలో మంగళవారం వైఎస్సార్‌సీపీ నేత చోడిపిల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన మాజీ సర్పంచ్ చెల్లూరి నూకరాజు, చోడిపిల్లి బాబూరావు, గరికిన రమణ, చెల్లూరి జ్యోతిరాజు, చోడిపల్లి తాతారావు, గరికిన అప్పలరాజు, చోడిపల్లి ఎర్ర అప్పలరాజు, చోడిపిల్లి సూరిబాబు, చోడిపిల్లి జగపతి, చోడిపల్లి గంగరాజు సహా సుమారు 200 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే కన్నబాబు వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ నేత వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన వారు తమ పార్టీలోకి చేరడం ఆనందదాయకమన్నారు. వైఎస్సార్‌సీపీని మరోసారి ఆశీర్వదించి జగనన్నకు అండగా నిలవాలన్నారు. నేవీ నిర్వాసితులకు రూ.1.3 లక్షలు ప్యాకేజీ అందజేసామని రానున్న రోజుల్లో వాడనర్సాపురం, కొత్తపట్నం గ్రామాలను తరలించాల్సి ఉంటుందని, అప్పుడు కూడా మెరుగైన ప్యాకేజీ అందించేందుకు తాను చర్యలు తీసుకుంటానన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఉప్పలపాటి సుకుమారవర్మ(తేజ), ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్‌రాజు, వైస్ ఎంపీపీ నర్సింగరావు, నియోజకవర్గ సచివాలయ కన్వీనర్ సూర్యనారాయణ, మండల సచివాలయ కన్వీనర్ రామకృష్ణ, ఉప సర్పంచ్ నూకరాజు, ఎంపీటీసీ సభ్యుడు నర్సింహులు పాల్గొన్నారు.

వైభవంగా మోదకొండమ్మ వీధి పండగ



మాడుగులలో మోదకొండమ్మ ప్రతి రూపమైన ఘటాలతో ఆలయానికి వెళ్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తదితరులు

- తీన్‌మార్, మహిళల కోలాటాలతో సందడి
- ఘటాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లిన డిప్యూటీ సీఎం బూడి

మాడుగుల: ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ వీధి పండగ అంగరంగ వైభవంగా శ్రీనివాసరావు, పరమేశ్వరి దంపతులు నిర్వహించారు. ఈ సందర్భంగా తీన్‌మార్ డప్పులు వాయిద్యాలు, మహిళల కోలాటాలు, చిటికెల భజనలు నడుమ అమ్మవారి పండగ అత్యంత వైభవంగా సాగింది. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అమ్మవారి ప్రతి రూపమైన ఘటాలు శిరస్సున పెట్టుకుని కాలినడకన ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు 101 ఘటాలతో మోదకొండమ్మ ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు వేమవరపు రామధర్మజ, సర్పంచ్ కళావతి, పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఏఎంసీ చైర్మన్ శేనాపతి, కొండలరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు గొల్లవిల్లి రాజేష్, పడాల అప్పలనాయుడు, క్రిష్ణమూర్తి, కల్యాణరాజు. కరణం రాము, శ్రీనాదు జగ్గారావు, గంగాధర్, సుంకరి శ్రీనివాసరావు, కోట్ని శ్రీరాంమూర్తి , కొట్యాడ భాస్కరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కనకమహాలక్ష్మి అమ్మవారి తీర్థ మహోత్సవం నేడు



కశింకోట: మండలంలోని బయ్యవరంలో కనకమహాలక్ష్మి అమ్మవారి తీర్థ మహోత్సవం బుధవారం పెద్ద ఎత్తున నిర్వహించేందుకు సన్నాహాలు చేసినట్లు మార్కెట్ కమిటీ అధ్యక్షుడు, ఆలయ కమిటీ వ్యవస్థాపక చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ గొల్లవిల్లి జయ మంగళవారం తెలిపారు. ఉత్సవంలో భాగంగా అమ్మవారిని పూలతో అలంకరించి ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక కుంకుమార్చనలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఉంటుందన్నారు. సాయంత్రం కోలాటాలు, భజనలు, తప్పెటగుళ్లు, సాంస్కృతిక కార్యక్రమాలతో తీర్థ మహోత్సవం ఉత్సాహంగా జరగనుందన్నారు.

నల్లమారమ్మ సన్నిధిలో భరత్‌కుమార్



నల్లమారమ్మను దర్శించుకుంటున్న మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: గ్రామ దేవతల ఉత్సవాలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. మండలంలోని సీతానగరం గ్రామంలో గ్రామదేవత శ్రీనల్లమారమ్మ అమ్మవారిని మంగళవారం ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామదేవతల మహోత్సవాలను ఘనంగా నిర్వహించే సమయంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జేబీఎన్‌పీ కో ఆర్డినేటర్‌గా సురేష్‌బాబు

అనకాపల్లి: జై భారత్ నేషనల్ పార్టీ(జేబీఎన్‌పీ) అనకాపల్లి నియోజకవర్గ కో ఆర్డినేటర్‌గా కనిశెట్టి సురేష్‌బాబు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ వ్యవస్థాపకుడు లక్ష్మీనారాయణ మంగళవారం నియామక పత్రాన్ని విజయవాడలో అందించారు. నగరానికి చేరుకున్న సురేష్‌బాబు స్థానిక గవరపాలెంలోని తన నివాసం వద్ద మీడియాతో మాట్లాడుతూ పార్టీ గెలుపు కోసం శక్తివంచన లేకుండా కృషిచేస్తానన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 6,462 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,700	4,250
మొదటి రకం	3,520	4,150
రెండో రకం	3,440	3,810
మూడో రకం	3,260	3,550

అనకాపల్లి సినిమాలు

ఈగల్	: రాజా
గామి	: సత్యనారాయణస్క్రీన్-1
ప్రేమలు	: సత్యనారాయణస్క్రీన్-2
షరతులు వర్తిస్తాయి (మూడు ఆటలు)	
లంబసింగి (మ్యాటీ)	: షిర్డిసాయి
రజాకర్	: పర్తిసాయి
తంత్ర	: వెంకటేశ్వర
రికార్డుబ్రేక్	: శ్రీసత్య
భీమా	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 60 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-9 యూనిట్లు, బీ పాజిటివ్-38 యూనిట్లు, ఓ పాజిటివ్-10 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 491 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 394 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

నాలుగు దశాబ్దాల కల నెరవేరిన వేళ



ఆవుకు చూడి ఇంజక్షన్ వేస్తున్న వైద్యురాలు



గ్రామీణ పశువైద్య కేంద్రం నూతన భవనం

- రూ.26.50 లక్షలతో పశువైద్య కేంద్రం నూతన భవనం
- సీహెచ్‌ఎన్ అగ్రహారంలో మూగ జీవాలకు మెరుగైన వైద్యం

మనుషులకు అనారోగ్యం వస్తే నోరు తెరిచి చెప్పుకోగలం. ఎవరో ఒకరి సాయంతో ఆస్పత్రులకు వెళ్లగలం. మరి పశువుల పరిస్థితి.. వాటి బాగోగుల సంగతి. వాటి గురించి కూడా ఆలోచించే మనసు చాలా అరుదు. గత ప్రభుత్వాలేవీ ఆ దిశగా కనీస చర్యలు తీసుకున్న పాపానపోలేదు. మూలనపడ్డ గ్రామీణ పశు వైద్య కేంద్రాలకు ప్రస్తుత ప్రభుత్వంలో మహర్దశ పట్టింది. అందుకు నిదర్శనమే సీహెచ్‌ఎన్ అగ్రహారంలో పశు వైద్య కేంద్రానికి నిర్మించిన నూతన భవనం. అందుబాటులోకి తీసుకొచ్చిన అత్యాధునిక పశువైద్య సేవలు.

తుమ్మపాల : వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాల అభివృద్ధితో ప్రతి రైతూ ఆర్థికంగా నిలదొక్కుకోవాలని ప్రభుత్వం ఊరూరా రైతు భరోసా కేంద్రా(ఆర్బీకే)లు ఏర్పాటు చేసింది. దశాబ్దాలుగా మూలనపడ్డ గ్రామీణ పశువైద్య కేంద్రాలను అభివృద్ధి చేసింది. ఆవులు, గేదెలు, కోళ్లు, మేకలు, గొర్రెల పెంపకాన్ని ప్రోత్సహించేలా సబ్సిడీ రుణాలను అందిస్తోంది. నాలుగైదు గ్రామాలకు అనుసంధానంగా ఉన్న పశువైద్య కేంద్రాలను అప్‌గ్రేడ్ చేసింది. వాటిలో నిత్యం వైద్య సిబ్బంది, సీజనల్ వ్యాధుల నివారణకు అవసరమైన మందులు, చూడి ఇంజక్షన్లు అందుబాటులోఉండేలా చర్యలు తీసుకుంది.

నాబార్డ్ నిధులతో కొత్త భవనం

మండలంలోని సీహెచ్‌ఎన్ అగ్రహారం కేంద్రంగా 1973లో గ్రామీణ పశువైద్య కేంద్రాన్ని నిర్మించారు. మొదట్లో కోఆపరేటివ్ బ్యాంకు(పీఏసీఎస్)తో కలిపి ఒకే భవనంలో ప్రారంభించారు. బ్యాంకు సేవల దృష్ట్యా పశువైద్య కేంద్రాన్ని సమీపంలోని విశాఖ డెయిరీ భవనంలోకి తరలించారు. అప్పటి నుంచి ఒకే గదిలో పశు వైద్య సేవలు అందిస్తూ, సిబ్బంది నానా ఇబ్బంది పడేవారు. గత ప్రభుత్వాలకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదు. నాలుగు దశాబ్దాల అనంతరం ప్రస్తుత ప్రభుత్వం చొరవతో నాబార్డ్ నిధులు రూ.26.50 లక్షలు మంజూరయ్యాయి. దీంతో శరవేగంగా భవనాన్ని నిర్మించారు. గత నెల 23న భవనాన్ని ప్రారంభించి, పశువులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు.

పశు వైద్యానికి పెరిగిన భరోసా

మండలంలోని సీహెచ్‌ఎన్ అగ్రహారంతో పాటు మార్టూరు, కూండ్రం, కొప్పాక గ్రామాల్లో గ్రామీణ పశువైద్య కేంద్రాలు ఉన్నాయి. వాటి పరిధిలో ఆయా గ్రామాల్లో పశువుల ఆరోగ్యం, పాల ఉత్పత్తి, అనారోగ్య పరిస్థితులపై క్షేత్రస్థాయి విచారణ, అవసరమైన నివారణకు చర్యలు, ఏటా వ్యాక్సినేషన్ అందించడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు.

తాజా భవనం అందుబాటులోకి రావడంతో పూర్తి స్థాయిలో పశు వైద్య సేవలకు వెసులుబాటు కలిగినట్లు సిబ్బంది చెప్తున్నారు. ఈ కేంద్రం పరిధిలోని ఐదు గ్రామాల్లో వెయ్యికిపైగా పశువులు, 500 వరకు కుటుంబాలు నాటు కోళ్ల పెంపకంలో ఉన్నాయి. వీరంతా ఇపుడు ఏ చిన్న సమస్య ఉన్నా పశువైద్య కేంద్రం సేవలు పొందుతున్నారు.



ప్రత్యేక గదిలో ఉన్న మందులు

అందుబాటులో పశు వైద్యం



నేను ఒక ఆవును పోషించుకుంటున్నాను. నిన్న రాత్రి నుంచి ఆవు విపరీతంగా అరుస్తుంది. దీంతో పశు వైద్య కేంద్రం వద్దకు ఆవును తీసుకొచ్చాను. డాక్టర్ ఆవును పరిక్షించి చూడికి వచ్చిందన్నారు. అర గంట వ్యవధిలో రెండు ఇంజక్షన్లు ఇచ్చారు. ఆవు పారిపోకుండా చుట్టూ ప్రహరీ ఉంది. అందుకే మగవారి సాయం లేకుండా నేనే ఆవును వైద్యం కోసం తెచ్చాను.

– బయ్యవరపు సత్యవతి,
పాడి రైతు, సీహెచ్‌ఎన్ అగ్రహారం

ఏళ్లనాటి సమస్య తీరింది



పశువైద్య కేంద్రానికి శాశ్వత భవన నిర్మాణంతో ఏళ్ల నాటి సమస్య తీరింది. గతంలో ఒకే గది ఉండటంతో మందుల స్టాక్, ఇతర సేవలకు ఇబ్బంది పడేవాళ్లం. ఇపుడు మందుల కోసమే ఓ ప్రత్యేక గది, అన్ని మందులూ, అన్ని రకాల పశు వైద్య సేవలు అందించగలుగుతున్నాం. చూడి ఇంజక్షన్లతో పాటు, ఇతర సమస్యలకు మందులు, తగు సూచనలు అందిస్తున్నాం.

– నిర్మలా యాదవ్,
జూనియర్ వెటర్నరీ అధికారి

ఎంపీ నిధులతో క్రీడా మైదానంలో బోరు



క్రీడా మైదానంలో కొత్తగా తీసిన బోరు

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో క్రీడాకారుల తాగునీటి అవసరాలకు వీలుగా బోరును ఏర్పాటు చేసినట్లు క్రీడా మైదనం వాకర్స్ అండ్ వాకర్స్ క్లబ్ ప్రతినిధి ఎం.రామకృష్ణ మంగళవారం తెలిపారు. ఎంపీ నిధులు రూ.2 లక్షలతో దీన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని బోరును తవ్వడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. కొత్తగా వేసిన బోరుకు తాగునీటి పైప్‌లైన్లు ఏర్పాటు చేయాలని కోరారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

అనకాపల్లి: జీవీఎంసీ విలీనగ్రామం కేఎస్‌ఆర్ పేట జాతీయ రహదారిలో అదే గ్రామానికి చెందిన లంకపల్లి ఉమామహేశ్వరరావు రోడ్డు దాటుతుండగా అనకాపల్లి నుంచి గాజువాక వెళ్తున్న ద్విచక్ర వాహనం మంగళవారం రాత్రి ఢీ కొంది. ఈ ఘటనలో ఉమామహేశ్వరరావు ఎడమకాలు విరిగిపోయింది. స్థానికుల సాయంతో 108 వాహనంలో అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు ఆస్పత్రికి చేరుకుని, వివరాలు సేకరించారు. ద్విచక్రవాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. క్షతగాత్రుని భార్య జయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ తేజేశ్వరరావు తెలిపారు.

గంజాయితో ముగ్గురి అరెస్ట్

- 32 కిలోల గంజాయి స్వాధీనం
- నిందితులు అల్లూరి జిల్లాకు చెందిన వారిగా గుర్తింపు



పట్టుబడిన గంజాయితో డీఎస్పీ సత్యనారాయణ, సీఐ రమణ, ఎస్‌ఐ ధనుంజయ్

సబ్బవరం: మండలంలోని అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారిపై అసకపల్లి ఫ్లై ఓవర్ వద్ద ఆటోలో తరలిస్తున్న 32 కిలోల గంజాయిని సబ్బవరం పోలీసులు పట్టుకున్నారు. సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో పరవాడ డీఎస్పీ సత్యనారాయణ మంగళవారం సీఐ పిన్నంటి రమణతో కలిసి వివరాలు వెల్లడించారు. సబ్బవరం ఎస్‌ఐ ధనుంజయ్‌కు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు ఆయన సిబ్బందితో కలసి జాతీయ రహదారిపై తనిఖీలు నిర్వహించి ఆటోలో తరలిస్తున్న 16 ప్యాకెట్లలోని 32 కిలోల గంజాయిని పట్టుకున్నారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకోని వారి నుంచి రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని ఆటోను సీజ్ చేసినట్లు తెలిపారు.పట్టుబడిన గంజాయి విలువ రూ.1.60 లక్షల వరకూ ఉంటుందన్నారు. గంజాయి అక్రమ రవాణాకు పాల్పడిన కిల్లోస్ గిరిబాబు, వంతల చంటి బాబు,వంతల కోటేశ్వరరావులను అదుపులోకి తీసుకోగా మరో వ్యక్తి పరారైనట్లు తెలిపారు. పట్టుబడిన వ్యక్తులంతా అల్లూరి జిల్లాలోని చింతపల్లి ప్రాంతానికి చెందిన వారిగా గుర్తించామన్నారు. వీరు చింతపల్లి ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి నుంచి గంజాయి తీసుకుని సబ్బవరం మీదగా తుని తరలిస్తున్నట్లు తెలుస్తుందన్నారు. పట్టుబడిన వ్యక్తులను కోర్టులో ప్రవేశ పెడతామని ఈ సందర్భంగా డీఎస్పీ తెలిపారు.

రివార్డుల కోసం సిఫార్సు

ఏజెన్సీకి సబ్బవరం ప్రాంతం ముఖద్వారం గంజాయి రవాణాకు నిందితులు ఈ మార్గాన్ని ఎంచుకుంటున్నారని డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు. సీఐ పిన్నంటి రమణ,ఎస్‌ఐ ధనుంజయ్ గంజాయి అక్రమ రవాణాకు చెక్ పెట్టడంలో విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. వీరికి రివార్డుల కోసం ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామన్నారు. సమావేశంలో ఎస్‌ఐ ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ అధ్యక్షుడిగా సత్యనారాయణ

అనకాపల్లి: స్థానిక వాకర్స్ క్లబ్ నూతన అధ్యక్షునిగా ఏరుబండి సత్యనారాయణ ఎన్నికయ్యారు. మండలంలోని తుమ్మపాల గ్రామంలో మంగళవారం వాకర్స్ క్లబ్ సమావేశం జరిగింది. ఇటీవల మరణించిన క్లబ్ అధ్యక్షుడు రామ అప్పారావు చిత్రపటానికి తొలుత నివాళి అర్పించారు. అనంతరం క్లబ్ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా సత్యనారాయణ, కార్యదర్శిగా మత్తుర్తి ఉమామహేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే పనులు చేయడంలో వాకర్స్ క్లబ్ ఎప్పుడూ ముందుంటుందన్నారు. పిల్లా హర శ్రీనివాసరావు, కోన అప్పారావులు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

15 మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ: మండలంలోని పెదముషిడివాడ గ్రామానికి చెందిన జెన్నారపు త్రినాథ్ మద్యం దుకాణం నుంచి 15 మద్యం సీసాలు(180 ఎంఎల్) కొనుగోలు చేసి అక్రమంగా తరలిస్తుండగా ఎస్‌ఐ టి.మల్లేశ్వరరావు దాడి చేసి అతన్ని పట్టుకున్నారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, త్రినాథ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

క్షయ నియంత్రణపై అవగాహన ర్యాలీ



క్షయ వ్యాధి వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

కశింకోట: ప్రతి ఒక్కరూ క్షయ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కె.తిరుపతిరావు సూచించారు. క్షయ వ్యాధి వారోత్సవాల్లో భాగంగా ఈ వ్యాధిపై అవగాహన కలిగిస్తూ వైద్య ఆరోగ్య సిబ్బంది మంగళవారం కశింకోటలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ భేదం, వయస్సుతో సంబంధం లేకుండా క్షయ వ్యాధి గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి సోకుతుందన్నారు. ఈ వ్యాధి ఊపిరితిత్తులు, ఇతర అవయవాలకు ప్రబలుతుందన్నారు. వ్యాధి నివారణకు ఆరు నెలలపాటు మందులు వాడాల్సి ఉంటుందని, ప్రతి పీహెచ్‌సీలో ఈ మందులు ఉచితంగా లభ్యమవుతాయన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి పరమానందరావు, పీహెచ్‌ఎన్ సత్యవతి, సూపర్‌వైజర్ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

పది పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు

డీఎస్పీ సత్యనారాయణ



సబ్బవరం హైస్కూల్ పరీక్ష కేంద్రంలో డీఎస్పీ సత్యనారాయణ తదితరులు

సబ్బవరం: పదోతరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన ఏర్పాట్లు చేసినట్లు పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ తెలిపారు. మండల కేంద్రంలోని సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల,ప్రతిభా విద్యాలయంలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను ఆయన సందర్శించి పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అప్రమత్తంగా వ్యవహరించాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. జిల్లా ఎస్పీ మురళీ కృష్ణ ఆదేశాల మేరకు పరీక్షా కేంద్రాల్లో మాల్ ప్రాక్టీస్ జరగకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు. ఆయన వెంట సీఐ పిన్నింటి రమణ తదితరులు ఉన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాల్సిందే..

ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో రాజకీయ పార్టీలు నిబంధనలకు లోబడి నడుచుకోవాలని డీఎస్పీ సత్యనారాయణ కోరారు. పెందుర్తి,యలమంచిలి నియోజకవర్గాల పరిధిలోని ఎన్నికల నిబంధనలు మీరకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మీటింగ్‌లు, ఊరేగింపులతో పాటు మైక్ పరిమిషన్,లౌడ్ స్పీకర్లకు అనుమతులు కావాలంటే జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి లేదా నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి నుంచి అనుమతులు తీసుకోవాలని తెలిపారు.సింగిల్ విండో సిస్టంలో అనుమతులు లభిస్తాయని ఈ సందర్భంగా ఆయన చెప్పారు.

గిజగాళ్లకు.. గూడు కడదాం!

- నేడు ప్రపంచ పిచ్చుకల దినోత్సవం
- పిచ్చుకల సంరక్షణలో మేటి గ్రీన్ క్లబ్

చల్లని ఉషోదయాన.. నులి వెచ్చని సూరీడు ప్రకృతిని పలకరిస్తున్న వేళ.. పచ్చని చెట్లపైనుంచి పిచ్చుకలు, ఇతర పక్షుల కిలకిలా రావాలను మించిన హాయిగొలిపే సంగీతం వేరే ఏముంటుంది. ఇంటి ముంగిళ్లలో వేసే ధాన్యం గింజల కోసం కిచకిచమంటూ వచ్చే పిచ్చుకలు, వాటిని తిన్నాక తుర్రుమని ఎగిరిపోతుంటే.. చూస్తూ పొందిన ఆనందానికి విలువ కట్టగలమా? ఇళ్లల్లో ఎక్కడో ఓ చోట చిన్న గూడు కట్టుకుని కిచకిచలాడుతూ అటూ ఇటూ తిరుగుతుంటే దొరికే ప్రశాంతత ఇపుడుందా? నేడు(మార్చి 20) ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన ఆ చిట్టిపొట్టి ప్రాణుల కోసం కాస్త ఆలోచిద్దాం. కాసింత ఆసరాగా నిలుద్దాం.



నెహ్రూచౌక్‌లో పంపిణీకి గ్రీన్ క్లబ్ సిద్ధం చేసిన మట్టిపాత్రలు, నీటి సీసాలు(ఫైల్)





గ్రీన్ క్లబ్ నేతృత్వంలో పిచ్చుక నమూనాతో అవగాహన

అనకాపల్లి: ఒకప్పుడు పంట చేలల్లో, ఇంటి ముంగిళ్లలో, ధాన్యపు రాశుల్లో కిలకిలమంటూ సందడి చేసే గిజగాళ్లు(పిచ్చుకలు) ప్రస్తుతం కనుమరుగవుతున్నాయి. విస్తరిస్తున్న నగర సంస్కృతి.. అడవులు, పంట చేలు తగ్గి, కాంక్రీట్ జంగిల్ విస్తరిస్తోంది. పెరుగుతున్న సాంకేతికత, కాలుష్యం, రేడియేషన్ ఈ బుల్లి ప్రాణాల పాలిట సంకటంగా మారుతున్నాయి. కాంక్రీట్ నిర్మాణాల మధ్య మనుషుల మనసులు కూడా కరకుదనాన్ని సొంతం చేసుకుంటున్నాయేమో! దీంతో తినడానికి ధాన్యం గింజలు దొరకక, ఉండేందుకు సరైన నీడలేక పిట్టల్లా.. కాదు.. ఈ పిట్టలే రాలిపోతున్నాయి. ఈ చిరు ప్రాణుల సంరక్షణలో కృషి చేస్తున్న వారూ ఉన్నారు.

అంతరిస్తున్న పిచ్చుకలు

రాష్ట్ర వ్యాప్తంగా పిచ్చుకలకు చెందిన 450 జాతుల్లో ప్రస్తుతం 40 జాతులు మాత్రమే ఉన్నట్లు పక్షి ప్రేమికులు చెప్తున్నారు. మనిషి తన స్వార్థ ప్రయోజనాల కోసం చేస్తున్న కాలుష్యం, సాంకేతికత ప్రభావం పిచ్చుకల పాలిట పెనుశాపంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిచ్చుకలు జీవావరణంలో చేసే మేలు అంతా ఇంతా కాదని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెప్తున్నారు. పంటలకు నష్టాన్ని కలుగజేసే క్రిమికీటకాలను ఆహారంగా తీసుకుని, పంటలను చీడపీడల నుంచి రక్షించే రైతు మిత్రులుగా వీటిని పేర్కొంటారు. అందుకే రైతులు తమ పంట చేతికి వచ్చేటపుడు కొన్ని వరి కంకులను చుట్టగా కట్టి, ఇంటి చూరుకు వేలాడదీస్తారు. ఇపుడు పూరిళ్లు కనుమరుగవుతున్నాయి. వ్యవసాయం కూడా హానికర పురుగు మందుల వినియోగంతో, పిచ్చుకల మనుగడను హరిస్తోంది.

పిచ్చుకల మనుగడ కోసం గ్రీన్ క్లబ్

ఏటా ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొణతాల ఫణిభూషణ్ తన సొంత నిధులతో పక్షులకు గూళ్లలో అమర్చడానికి మట్టి పాత్రలు, ధాన్యపు కంకులు ఉచితంగా పంపిణీ చేస్తుంటారు. దేవాలయాలు, పార్కులు, పాఠశాల ఆవరణల్లో వీటిని ఏర్పాటు చేస్తూ, ప్రజలకు ఉచితంగా అందిస్తారు. కరపత్రాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. యువతను పిచ్చుకల సంరక్షణ దిశగా పలు కార్యక్రమాల ద్వారా సమాయత్తం చేస్తున్నారు. చేయి చేయి కలుపుదాం– పిచ్చుకల సంతతిని సంరక్షిద్దాం, తిండి గింజలు, కాసిన్ని నీళ్లు పక్షులకు అందిద్దాం–మనతో పాటు చిన్ని పక్షుల్ని బతికిద్దాం అంటూ ప్రజల్ని చైతన్య పరుస్తున్నారు.

ఘనంగా జువ్వమాంబ పండగ



జువ్వమాంబను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, నాయకులు

పరవాడ: కన్నూరు శివారు మడకపాలెంలో కొలువు దీరిన జువ్వమాంబ అమ్మవారి పండగను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి కృష్ణవేణి, ఎంపీటీసీ గొల్లవిల్లి శ్రీనివాసరావు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌ను గ్రామ సర్పంచ్ కృష్ణవేణి, ఎంపీటీసీ శ్రీనివాసరావు, పీఏసీఎస్ డైరెక్టర్ మడక సూరిబాబు శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, పార్టీ నాయకులు పైల అప్పలనాయుడు, మడక అప్పారావు, మడక దారరాజు, మడక విజయగణేష్, కోరుకొండ వెంకటరమణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పారిపల్లెమ్మ అమ్మవారికి జలాభిషేకం



బిందెలతో జలం తీసుకువెళుతున్న భక్తులు

మునగపాక : మండలంలోని వాడ్రాపల్లి పారిపల్లెమ్మ అమ్మవారి విగ్రహానికి మంగళవారం జలాభిషేకం చేశారు. ఈనెల 26న జరగనున్న పండగలో భాగంగా వాడ్రాపల్లి ఆవలోని నీటిని సేకరించి బిందెలతో ఆలయానికి ఊరేగింపుగా వచ్చారు. సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు ఇతర పెద్దలంతా కార్యక్రమంలో పాల్గొన్నారు.

పోషక విలువలతో కూడిన ఆహారం శ్రేయస్కరం

మునగపాక: మహిళలు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని టాటా ట్రస్ట్ ప్రతినిధి భాగ్యలక్ష్మి కోరారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా టాటా ట్రస్ట్ అలాగే ఏసియన్ పెయింట్స్ సహకారంతో మంగళవారం మండలంలోని నాగులాపల్లి అంగన్‌వాడీ కేంద్రాలు–3,4లలో బాలింత లు, గర్భిణులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా చిరు ధాన్యాలు తీసుకోవాలన్నారు. పుట్టబోయే బిడ్డ ఆరోగ్యకరంగా ఉండాలంటే తల్లులు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పద్మజ, సరస్వతి, ఆశ కార్యకర్తలు శ్రావణి, లక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

పరవాడ: రాష్ట్ర బేస్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లాలో నిర్వహించిన 31వ జూనియర్ నేషనల్ బేస్ బాల్ చాంపియన్‌షిప్‌కు పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో 11 తరగతి చదువుతున్న ఏవీ శశాంక వర్మ, కె.ధీరజ్‌సాయిరామ్ ఎంపికయ్యారని పాఠశాల స్పోర్ట్స్ డైరెక్టర్ జి.మధుబాబు చెప్పారు. పంజాబ్ రాష్ట్రంలో మే 22 నుంచి 26 వరకు జరిగే జాతీయ స్థాయి బేస్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఇద్దరు అర్హత సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి ప్రత్యేకంగా అభినందించారు.

జేఎస్‌ఆర్‌వో తరలింపు రికార్డుల పరిశీలన

అనకాపల్లి: జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో జాయింటు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం(జేఎస్‌ఆర్‌వో) తరలింపు రికార్డులను ఆర్టీఐ చట్టం ఉద్యమకర్త కాండ్రేగుల వెంకటరమణ మంగళవారం పరిశీలించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తరలించేందుకు సంబంధించిన రికార్డులోని 22 పేజీల సమాచారాన్ని ఆయనకు జిల్లా రిజిస్ట్రార్ సీహెచ్ జానకీదేవి అందించారు. ప్రభుత్వ ఉత్తర్వులు లేకుండా స్వప్రయోజనాల కోసం కార్యాలయాన్ని పట్టణ శివారు జాతీయ రహదారి కొత్తూరు జంక్షన్‌కు తరలించారని ఆరోపిస్తూ కాండ్రేగుల వెంకటరమణ రాష్ట్ర సమాచార కమిషన్‌లో కేసు దాఖలు చేశారు. కేసు విచారణ సందర్భంగా రికార్డుల పరిశీలనకు అనుమతించాలని రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ (ఎస్‌సీఐసీ) ఆర్.మహబూబ్‌బాషా ఉత్తర్వుల మేరకు ఆయన రికార్డుల్ని పరిశీలించారు.

సొంత భవనం ఉండీ, కార్యాలయాన్ని తరలించిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్నట్లు తెలిపారు.